సాక్షి
జగిత్యాల

బుధవారం । 20 । ఆగస్టు । 2025

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి ఉధృతి

ధర్మపురి/జగిత్యాలఅగ్రికల్చర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 39 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. సంతోషిమాత, మంగలిగడ్డ పుష్కరఘాట్లు మునిగిపోయాయి. భక్తులు మెట్లపైనే స్నానాలు ఆచరించారు. భక్తులు లోపలికి వెళ్లకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఎస్సారెస్పీకి 2.75 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో 3,03,867 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు.


ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి →

న్యూస్‌రీల్

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం


బుగ్గారంలో పర్యటిస్తున్న వైద్యాధికారుల బృందం

బుగ్గారం: పరిశుభ్రతతోనే విషజ్వరాలు, అంటువ్యాధులకు దూరంగా ఉండొచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం పర్యటించారు. వార్డుల్లో పర్యటించి డ్రైనేజీ, నీరు నిలిచిన ఖాళీ స్థలాలను పరిశీలించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అత్యంత ముఖ్యమని అన్నారు. గ్రామంలో ఎవరికి ఎలాంటి అనారోగ్యం ఏర్పడినా వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అల్లెంకి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు వెంకటేశ్, శ్రీనివాస్, కార్యదర్శి అక్బర్, ఏఎన్‌ఎంలు శైలజ, స్వప్న, శోభన్, మహేంద్ర పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టుకు ఇసుక తరలింపును అడ్డుకోవద్దు


గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

మెట్‌పల్లిరూరల్: సూరమ్మ ప్రాజెక్టు పనుల కోసం ఆత్మకూర్ వాగు నుంచి ఇసుక తరలిస్తున్నామని, ఎవరైనా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నీతా, సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఆత్మకూర్‌లో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఇసుక విషయమై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కథలాపూర్ మండలంలో నిర్మిస్తున్న సూరమ్మ ప్రాజెక్టుకు అవసరమైన ఇసుకను ఆత్మకూర్ వాగు నుంచి తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారని, గ్రామస్తులు సహకరించాలని కోరారు. కొందరు వ్యక్తులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించడంతో అట్రాసిటీ కేసు నమోదు చేశామని, ఇసుక రవాణాను అడ్డుకున్నందుకే కేసు పెట్టామన్నప్రచారంలోవాస్తవం లేదన్నారు.

యూరియా కొరతకు కేంద్రానిదే బాధ్యత


బోర్నపల్లిలో గోదావరి తీరాన్ని పరిశీలిస్తున్న మాజీమంత్రి జీవన్‌రెడ్డి

రాయికల్: రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రం బాధ్యత వహించాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయికల్‌లో విలేకరులతో మాట్లాడారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తికి బ్రేక్ పడిందని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఎప్పటికప్పుడు కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. రాయికల్ మండలం బోర్నపల్లి, సారంగాపూర్ మండలం కలమడుగు, మల్లాపూర్ మండలం బాదనకుర్తి, నిర్మల్‌లో గుమిర్యాలలో గోదావరిపై వంతెనల నిర్మాణం తన జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి, నాయకులు పొన్నం శ్రీకాంత్, షాకీర్, చింతలపల్లి గంగారెడ్డి, బాపురపు నర్సయ్య ఉన్నారు.

పుట్టినరోజు కానుకగా యూరియా బస్తా


మధుకు యూరియా బస్తాఅందిస్తున్న మిత్రులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో ముక్కెర మధు అనే యువకుడి పుట్టినరోజు వేడుకలు మంగళవారం రాత్రి నిర్వహించారు. పుట్టినరోజు కానుకగా మధుకు తోటి మిత్రులు యూరియాబస్తా బహుమతిగా అందించారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, అందుకోసమే బస్తాను కానుకగా అందించామని యువకులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని యువకులు మంచాల మహేశ్, మామిడిపెల్లి శివ, శేఖర్, సంజీవ్, మనోజ్, మహిపాల్ కోరారు.

జిల్లాకు తేలికపాటి వర్షసూచన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త బి. శ్రీ లక్ష్మి తెలిపారు. ఈనెల 20 నుంచి 24 వరకు అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని, గంటకు 30నుంచి 40 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తుందని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 31 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

వర్షంలో పనులు.. నాణ్యత కరువు

- పోసింది పోసినట్టే కొట్టుకుపోతున్న సీసీ రోడ్లు
- కొన్నిచోట్ల ఆలస్యం.. మరికొన్ని చోట్ల హడావుడి
- అసంపూర్తి పనులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

- ఈ చిత్రంలో కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని విద్యానగర్ పరిధి 17వ వార్డు మంచినీళ్ల ట్యాంక్ వద్ద కొత్తగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులు. కాంట్రాక్టర్ రెండురోజుల క్రితం సీసీ రోడ్డు పోశాడు. కానీ.. సోమవారం కురిసిన వర్షానికి అది పూర్తిగా లేచిపోయింది. సీసీ రోడ్డు పోసినప్పటికీ ఓ పాలిథిన్ కవర్ కప్పి చేతులు దులుపుకొన్నారు. స్థానికులకు ఆ మార్గమే దిక్కు కావడంతో చాలామంది ఆ రోడ్డుపై నుంచే నడవడంతో సీసీ లేచి గుంతలమయంగా మారింది. ఒక్కరోజు కూడా గడవకముందే సీసీ రోడ్డు ఇలా కొట్టుకుపోవడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం ఈ సీసీ రోడ్డు పరిస్థితే కాదు.. జగిత్యాల బల్దియాలో ప్రతి వార్డులోనూ ఇదే దుస్థితి. కొన్నిచోట్ల పనులు మొదలుపెట్టి తవ్వి.. దాంట్లో కొద్దిపాటి కంకరపోసి వదిలేస్తున్నారు కాంట్రాక్టర్లు. అక్కడక్కడ హడావుడిగా పనిచేస్తుండటంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదు.


సోమవారం కురిసిన వర్షానికి లేచిపోయిన సీసీరోడ్డు

జగిత్యాల: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, నాణ్యతగా లేకుండా చేస్తే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రతి వార్డు తిరుగుతూ.. పనులను పర్యవేక్షిస్తూ.. ఇంజనీరింగ్ అధికారులను ఆదేశిస్తున్నారు. అయినప్పటికీ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తోంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొన్నిచోట్ల నెలలు తరబడినా చేయకపోవడం, మరికొన్ని చోట్ల కొబ్బరికాయ కొట్టి నెలలు గడిచినా రోడ్లను తవ్వి వదిలేస్తున్నారు. జగిత్యాల బల్దియాకు టీయూఎఫ్ఐడీసీ కింద రూ.20కోట్లు మంజూరయ్యాయి. ప్రతి కాలనీలో సీసీరోడ్లు పనులు చేపడుతున్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. నాణ్యత లేదంటూ స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని నాణ్యత

సీసీరోడ్లు మొదలుపెట్టాక.. పొక్లెయిన్‌తో లేయర్ తీసి తర్వాత చిన్న కంకరపోయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్లు కంకర పోస్తే చాలా ఖర్చు అవుతుందని ఎక్కడైనా కూల్చివేసిన ఇళ్లకు సంబంధించిన గార్బేజ్ తీసుకొచ్చి ఆ లేయర్‌పై పోస్తున్నారు. నాణ్యమైన మొరం పోయాల్సి ఉండగా.. ఎక్కడిదో తీసుకొస్తున్నారు. నిత్యం పర్యవేక్షించాల్సిన వర్క్ ఇన్‌స్పెక్టర్, ఏఈలు గానీ పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్లు చెత్తాచెదారం పోసి నింపుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలనీలో ఫిర్యాదు చేస్తే చిన్నపాటి కంకర నింపుతూ మమ అనిపిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

నిబంధనల ప్రకారం సీసీరోడ్లు నిర్మించేటప్పుడు ఎంత సిమెంట్ వాడుతున్నారు..? ఎంత ఎంఎం కంకర వేస్తున్నారు..? వంటి అంశాలను అధికారులు పని పూర్తయ్యేవరకూ పరిశీలిస్తూ ఉండాలి. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత లేకుండా సీసీరోడ్లను నిర్మిస్తున్నారు కాంట్రాక్టర్లు. ఫలితంగా వేసిన రెండుమూడు నెలల్లోనే చెడిపోతున్నాయి. కొందరు అధికారులు అమ్యామ్యాలకు అలవాటుపడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీసీరోడ్లు మొదలు పెట్టాక కంకర పోయడంతో పాటు, దానిపై నాణ్యతతో కూడిన మొరం పోసి రోడ్డురోలర్‌తో చదును చేయాల్సి ఉంటుంది. పూర్తిస్థాయిలో చదును చేసిన అనంతరం నాణ్యతతో కూడిన సిమెంట్ బస్తాలు కంకరతో కలిపి రోడ్డు వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు కాంట్రాక్టర్లు నిబంధనలు గాలికి వదిలేస్తూ ఇష్టారాజ్యంగా చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రోడ్డంతా పూర్తయిన అనంతరం ఇటీవల వంచం డ్రై ఫ్యాన్ (వీడీఎఫ్) ద్వారా సీసీరోడ్డును నీట్‌గా చేయాల్సి ఉంటుంది. ఏదో రాత్రిపూట డ్రై ఫ్యాన్‌తో మీదమీద చేస్తూ మమ అనిపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో చేపడుతున్న సీసీరోడ్లపై నిఘా ఉంచాలని, పూర్తిస్థాయిలో నిర్మితమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పనిచేసి పాలిథిన్ కవరు కప్పిన కాంట్రాక్టర్

నాణ్యతతో ఉంటేనే బిల్లులు

నాణ్యతతో కూడిన సీసీరోడ్లు వేస్తేనే బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంటుంది. కాంట్రాక్టర్లు సీసీరోడ్డు వేసిన అనంతరం క్వాలిటీ అధికారులు పరిశీలించి ఏదో ఒకచోట డ్రిల్లింగ్ చేసి దానికి సంబంధించిన మెటీరియల్‌ను తీసుకెళ్లి నాణ్యత ఉందా..? లేదా..? అని చూస్తుంటారు. కాంట్రాక్టర్లు మాత్రం నాణ్యతతో ఉన్న ఏదోచోటును చూపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏదో ఒక విధంగా బిల్లులు మంజూరు చేయించుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నాణ్యత లేకుంటే చర్యలు

నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటాం. విద్యానగర్‌లో వాంచం డ్రైఫ్యాన్ ద్వారా రోడ్డును నీట్‌గా చేసి దానిపై పాలిథిన్ కవర్ కప్పుతున్నారు. వర్షానికి కొంత లేయర్ పోయింది. మళ్లీ రోడ్డు నాణ్యతగా చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి చోట పకడ్బందీగా పర్యవేక్షణ చేస్తున్నాం. – అనిల్, ఏఈ

ప్రజలకు ఇబ్బంది రానీయొద్దు

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల/కోరుట్లరూరల్/మెట్‌పల్లి: వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. స్థానిక బల్దియా కార్యాలయంలో అదనపు కలెక్టర్ లతతో కలిసి కోరుట్ల, మెట్‌పల్లి బల్దియా అధికారులతో సమావేశమయ్యారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అయిలాపూర్ రోడ్డు దెబ్బతిన్న నేపథ్యంలో రాకపోకలకు ఇబ్బంది రానీయొద్దన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్లు రవీందర్, మోహన్, డీఈ మధుసూదన్, ఏడీలు పాల్గొన్నారు. అనంతరం తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 75మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు ఫయాం, రమేశ్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం మెట్‌పల్లిలోని గంగారాం మెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందంటూ నిర్వాహకులను అభినందించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

రోళ్లవాగుకు గేట్లు ఎప్పుడు బిగిస్తారు..?

- కాలయాపన ఎందుకు చేస్తున్నారు..?
- ఎమ్మెల్సీ ఎల్.రమణ

సారంగాపూర్: బీర్పూర్ శివారు రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తయినా.. గేట్లు మాత్రం ఎందుకు బిగించడం లేదని ఎమ్మెల్సీ ఎల్.రమణ ప్రశ్నించారు. వర్షాలకు ప్రాజెక్టులోకి చేరుతున్న నీరు గేట్లు బిగించకపోవడంతో వృథాగా గోదావరిలో కలుస్తోందని తెలిపారు. 15వేల ఎకరాలకు సాగు నీరందించాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టి.. 90శాతం పూర్తి చేశామని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.20 కోట్లు విడుదల చేసిందని, జూన్‌లోనే అటవీశాఖ నుంచి అనుమతులు కూడా వచ్చాయని, ఇప్పటి వరకు ఎలాంటి పురోగతీ లేదని పేర్కొన్నారు. వానాకాలం సీజన్ సగం దాటినా.. గేట్లు ఎందుకు బిగించడం లేదో తెలపాలని డిమాండ్ చేశారు.


రోళ్లవాగు తూము నుంచి వృథాగా వెళ్తున్న నీరు

బోధనోపకరణలతో నాణ్యమైన విద్య

- డీఈవో రాము


బోధనోపకరణలను పరిశీలిస్తున్న డీఈవో రాము

గొల్లపల్లి: ప్రాథమికస్థాయి విద్యార్థులకు బోధనోపకరణల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తే సులభతరంగా అర్థమవుతుందని డీఈవో రాము అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ టీఎల్ఎం మేళా నిర్వహించారు. 35 పాఠశాలల విద్యార్థులు 124 నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రతి సబ్జెక్ట్‌కు ఒకటి చొప్పున నాలుగు సబ్జెక్ట్‌లకు నాలుగు నమూనాలతో ప్రదర్శనలు చేపట్టారు. విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటపాటలు, కథలు వంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు తయారుచేసిన లోకాస్ట్, నో కాస్ట్ బోధనోపకరణ సామగ్రి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు ప్రదర్శించిన 10 మంది ఉపాధ్యాయులను విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో చెరుకు రాజన్న, ఎంపీడీవో రాంరెడ్డి, తహసీల్దార్ మాజిద్ పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తున్నాం..

- రైతులకు చేదోడువాదోడుగా 'రైతు మిత్ర'
- సరికొత్త పంటల వైపు ప్రోత్సాహం
- 'సాక్షి'తో జిల్లా వ్యవసాయాధికారి వడ్డేపల్లి భాస్కర్

జగిత్యాలఅగ్రికల్చర్: 'జిల్లాలో యూరియా కొరత లేకుండా చూస్తున్నాం. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఒకట్రెండు చోట్ల కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ సమస్యను అధిగమిస్తున్నాం. రైతులకు విత్తనాల ఎంపికలో.. పురుగుమందుల పిచికారీలో.. రసాయన ఎరువులు వినియోగంలో.. దిగుబడి పెంచడంలో చేదోడు, వాదోడుగా ఉండేందుకు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో 'రైతుమిత్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నాం..' అని అన్నారు జిల్లా వ్యవసాయాధికారి వడ్డెపల్లి భాస్కర్. జిల్లాలో పంటల సాగు, యూరియా కొరత, రైతు రుణమాఫీ, రైతు భరోసాపై ఆయన మంగళవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.



సాక్షి: జిల్లాలో అమలు చేస్తున్న రైతుమిత్ర విశేషాలు..?

డీఏవో: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లాలో తొలిసారి రైతుమిత్ర కార్యక్రమం అమలు చేస్తున్నాం. జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి డివిజన్లలో ఏడీఏలు, ఏవోలు, శాస్త్రవేత్తలు ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి 1.30 వరకు అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన సాగు సలహాలు అందిస్తారు. రైతులు తెలిసీతెలియక నకిలీ పురుగు మందులు, రసాయనాలు వాడుతూ మోసపోతున్నారు. అవసరం లేకున్నా.. మందులషాపు వారు ఇచ్చే రసాయనాలు పిచికారీ చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

సాక్షి: ఏయే పంటలు.. ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు..?

డీఏవో: ఇప్పటివరకు వరి 2.85 ఎకరాలు, మొక్కజొన్న 32వేల ఎకరాలు, పత్తి 16 వేల ఎకరాలు, పసుపు 10,200 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరి విస్తీర్ణం మరో 25 వేల ఎకరాలకు పెరిగే అవకాశం ఉంది.

సాక్షి: జిల్లాలో యూరియా కొరతపై..?

డీఏవో: ప్రస్తుతానికి జిల్లాలో యూరియా కొరత లేదు. పంట దశలను బట్టి యూరియాను రైతులకు అందిస్తున్నాం. జిల్లాకు వచ్చిన యూరియాను పంట విస్తీర్ణాన్ని బట్టి ఆయా మండలాలకు పంపిస్తున్నాం. ఇప్పటివరకు 23,567.985 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశాం.

సాక్షి: కొన్ని ప్రాంతాల్లో ఒక్కటే బస్తా ఇస్తున్నారు..?

డీఏవో: రైతులకు అవసరాన్ని బట్టి యూరియా అందిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 1244.097 టన్నుల యూరియా అందుబాటులో ఉంది. యూరియా దొరకదనే ఉద్దేశంతో కొందరు నిల్వ చేస్తున్నారు. అవసరమైనచోట ఒక్కటే బస్తా ఇస్తే విషయాన్ని ఆయా మండలాల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకురావచ్చు. ఆయా మండలాల ఏవోల నంబర్లు ఫెర్టిలైజర్ షాపుల్లో అందుబాటులో ఉంచుతున్నాం. యూరియా అందని రైతులు ఆయా నంబర్లకు ఫోన్ చేస్తే సమస్యను పరిష్కరిస్తారు. వారు స్పందించకుంటే నన్ను సంప్రదించవచ్చు. నా ఫోన్ నంబర్ **89777 45435**

సాక్షి: రైతు రుణమాఫీ, రైతుభరోసా రాలేదనే ఆరోపణలపై..?

డీఏవో: ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో రూ.2 లక్షల లోపు ఉన్న పంట రుణాలు 80,515 మంది రైతులకు రూ.721 కోట్లు మాఫీ అయ్యాయి. మాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వానికి అందించాం. అలాగే మూడేళ్లుగా పంట వేయని రైతులు.. సాగుకు పనికిరాని భూములకు మాత్రం రైతు భరోసా రాలేదు. జిల్లాలో రైతు భరోసా కింద 2.25 లక్షల మంది రైతులకు రూ.243 కోట్లు వచ్చాయి.

సాక్షి: వరి సాగు విస్తీర్ణం పెరగడానికి కారణం..?

డీఏవో: జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. దీనికితోడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఉండటం.. ప్రభుత్వ మద్దతు ధర ఉండటంతోపాటు యాంత్రీకరణ రావడంతో వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

సాక్షి: ఆరుతడి, కొత్త పంటల వైపు మళ్లకపోవడానికి కారణం..?

డీఏవో: రైతులు కొంత విస్తీర్ణంలో కందులు, పెసర, వేరుశెనగ వంటి పంటలు సాగు చేస్తున్నారు. కొంత మేర మార్కెటింగ్ సౌకర్యం లేదు. కోతుల బెడద, పక్షుల బెడద ఎక్కువగా ఉండటంతో రైతులు అటు వైపు వెళ్లడం లేదు. పత్తి దిగుబడి ఏడాది తగ్గుతుండటం.. కూలీలు దొరకకపోవడం, దొరికినా అధిక ఖర్చు కావడంతో సాగును తగ్గిస్తున్నారు. ఆయిల్ పాం సాగును ప్రోత్సహిస్తున్నాం.

సాక్షి: సబ్సిడీపై కొన్నేళ్లుగా యంత్ర పరికరాలు అందించడం లేదంటున్నారు..?

డీఏవో: ఈ ఏడాది యాంత్రీకరణ పథకం కింద రైతులకు సబ్సిడీపై కల్టివేటర్లు, స్ప్రేయర్స్, పవర్ వీడర్స్, రోటోవేటర్లు వంటివి అందిస్తున్నాం. ఇందుకోసం జిల్లాకు రూ.3.11 కోట్ల బడ్జెట్ కూడా వచ్చింది. అవసరమైన రైతులు ఆయా మండలాల వ్యవసాయాధికారులకు దరఖాస్తులు సమర్పించవచ్చు.

సాక్షి: రసాయన ఎరువులు అధికంగా వాడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది..?

డీఏవో: రైతులు మోతాదును మించి రసాయన ఎరువులు వాడుతున్నది నిజమే. అందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నేచురల్ ఫార్మింగ్ కింద ఒక కొత్త పథకాన్ని జిల్లాలో అమలు చేస్తున్నాం. ఇందుకోసం 20 క్లస్టర్లను ఎంపికచేసి, ఒక్కో క్లస్టర్‌కు కొంతమంది అభ్యుదయ రైతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇవ్వనున్నాం. వారితో రసాయనాలు లేని పంటలు సాగు చేయించాలని ప్రయత్నాలు మొదలుపెట్టాం.

సాక్షి: పంట పరిహారం వచ్చిందని ప్రభుత్వం.. రాలేదని రైతులు అంటున్నారు?

డీఏవో: జిల్లాలో గతేడాదికి జరిగిన పంట నష్టం గురించి ప్రభుత్వానికి నివేదిక అందించాం. రూ.5.20 కోట్లు మంజూరు చేసింది. ఇంకా నిధులు విడుదల కాలేదు. నిధులు విడుదల కాగానే రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తాం.

సాక్షి: రైతువేదికలు నిరూపయోగంగా ఉన్నాయంటున్నారు..?

డీఏవో: జిల్లాలో కొన్ని రైతువేదికలు ఊరికి దూరంగా ఉండటంతో సమస్యలు వస్తున్నాయి. అయినప్పటికీ దాదాపు అన్ని రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకొస్తున్నాం. రాష్ట్రస్థాయిలో జరిగే ప్రతి వీడియో కాన్ఫరెన్స్‌తోపాటు రైతు కార్యక్రమాలన్నీ రైతు వేదికల్లో నిర్వహిస్తున్నాం. ఆయా క్లస్టర్ ఏఈఓలు రైతు వేదికల్లోనే అందుబాటులో ఉంటున్నారు.

విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత

- వినియోగదారులకు అందని సేవలు
- ఉన్న సిబ్బందిపై అదనపు భారం

పెగడపల్లి: జిల్లావ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఖాళీల కొరత వేధిస్తోంది. కిందిస్థాయి సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఏటా పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్లకు సరిపడా సిబ్బంది పోస్టులు భర్తీ కావడం లేదు. ఉన్నవారిపైనే అదనపు భారం పడుతుండటంతో ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు రోజువారి కూలీలుగా పనిచేస్తుండటంతో కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. వర్షాకాలంలోనే ఎక్కువగా విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. అక్కడక్కడ సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నా ఇబ్బంది మాత్రం తప్పడం లేదు. ఇద్దరుముగ్గురు చేసే పనిని ఒక్కరే చేయాల్సి రావడంతో వినియోగదారులకు అందించే సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో ఏటా గృహ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నా.. దానికి తగ్గట్టు సిబ్బందిని నియమించడం లేదు. ఒక్కో డివిజన్‌లో పరిధిలో ప్రతి 1500 సర్వీసులకు ఒక జూనియర్ లైన్‌మన్, ప్రతి మూడు వేల కనెక్షన్లకు అసిస్టెంట్ లైన్‌మెన్, ప్రతి 4500 విద్యుత్ కనెక్షన్లకు లైన్‌మన్, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఉండాలి. సెక్షన్ మొత్తానికి ఒక సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, ఫోర్‌మన్ ఉండాలి. కానీ.. ఉండాల్సిన నిష్పత్తిలో ఎక్కడా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది కొరతతో వ్యవసాయ బావుల వద్ద ఫ్యూజ్‌లు పోతే పునరుద్ధరణ ఆలస్యం అవుతోంది. గ్రామాల్లోనూ రాత్రిపూట ఫ్యూజ్‌లు పోతే పెట్టడానికి ఎవరూ అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. వారు వచ్చేలోపు రైతులు, స్థానికులే సరిచేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు విద్యుత్ ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలో జేఎల్ఎం, ఏఎల్ఎం పోస్టులు ఎక్కువగా ఖాళీలున్నాయి. ఈ పోస్టులు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోవడం లేదు. 2019లో జేఎల్ఎం పోస్టులు భర్తీ కాగా.. ఏడాది విధులు పూర్తి చేసుకున్న వారందరూ ఏఎల్ఎంలుగా పదోన్నతి పొందారు. జేఎల్ఎం సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న వారిపై పని భారం పడుతుండటంతో ఒత్తిడికి గురవుతున్నామని వాపోతున్నారు. ఏ రాత్రయినా విద్యుత్ పునరుద్ధరణకు క్షేత్రస్థాయి సిబ్బందే పనులు చేయాల్సి వస్తోంది. అత్యవసర సమయంలో వెళ్లాలంటే మరో సిబ్బంది అదనంగా పని చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.


పెగడపల్లి విద్యుత్ సబ్ స్టేషన్

ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం



విద్యుత్ శాఖలో సిబ్బంది ఖాళీలున్నప్పటికీ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్యలు ఏర్పడితే అక్కడున్న సిబ్బందితో సమస్య పరిష్కరిస్తున్నాం. పోస్టుల ఖాళీల విషయమై ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించాం.

– సుదర్శనం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ

పోస్టులు, ఖాళీల వివరాలు

హోదా	పోస్టులు	ఉన్నది	ఖాళీలు
జూ.లైన్‌మెన్లు	207	21	186
అ.లైన్‌మెన్లు	207	189	18
లైన్‌మెన్లు	151	146	05
లైన్ ఇన్‌స్పెక్టర్లు	61	61	03
సీ.లైన్‌స్పెక్టర్లు	21	19	02
ఫోర్‌మెన్లు	11	7	04
అ.ఇంజినీర్లు	51	49	02
డి.ఇంజినీర్లు	16	13	03

జిల్లాలో సబ్ డివిజన్లు	09
గృహ విద్యుత్ కనెక్షన్లు	3,41,104
కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు	43,825
ఇండస్ట్రియల్ విద్యుత్ కనెక్షన్లు	4,374
వ్యవసాయ కనెక్షన్లు	1,38,689
మొత్తం కనెక్షన్లు	5,37,780



దిగువకు వెళ్తున్న వరద నీరు

గోదావరి ఉరకలు

రామగుండం: ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో తరలివచ్చే వరదనీటితో గోదావరి నది ఉరకలేస్తోంది. ఈ నేపథ్యంలోనే రామగుండం సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం 35 గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరి నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.185 టీఎంసీలు నిల్వ ఉంది. శ్రీరాంసాగర్ నుంచి 2,02,998, కడెం నుంచి 7,580, వరద 1,03,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. హైరాబాద్‌కు 275 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంపుహౌస్‌కు 3,150 క్యూసెక్కులు తరలిస్తున్నారు.



అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి.. కోనేరులో స్నానాలు చేశారు. క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. సామూహిక అంజనేయస్వామి అభిషేకాల్లో పాల్గొన్నారు. లడ్డూ, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.6లక్షలు, ప్రత్యేక దర్శనం టికెట్ల విక్రయాల ద్వారా రూ.4.12 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీకాంత్ రావు, చంద్రశేఖర్, సునీల్‌కుమార్, హరిహరనాథ్, అశోక్, తదితరులు పర్యవేక్షించారు.



శరణు శరణు రాజన్న



వేములవాడ: శ్రావణమాసం చివరిదశకు చేరుకుంటుండడంతో మంగళవారం సైతం రాజన్నకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, అమ్మవారికి కుంకుమపూజ మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

వేధింపులతో హమాలీ ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్‌రూరల్: వడ్డీ వ్యాపారుల వేధింపులతో ఓ హమాలీ కార్మికుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి కథనం మేరకు బొమ్మకల్ పరిధిలోని కృష్ణానగర్‌కు చెందిన తంగెళ్ల శ్రీనివాస్(44) గ్రామంలోని చింతపండు నాగరాజు వద్ద రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నాడు. పలు విడతల్లో రూ.15 లక్షల వరకు చెల్లించాడు. ఇంకా రూ.27.60లక్షలు ఇస్తేనే అప్పు ముట్టుతుందంటూ శ్రీనివాస్‌కు లాయర్ నోటీసులు పంపించాడు. శ్రీనివాస్ తన వద్ద డబ్బులు లేవని చెప్పగా, భూమిని రిజిస్ట్రేషన్ చేయాలంటూ నాగరాజు తోపాటు మరో వ్యక్తి బట్టు రాజేందర్ వేధింపులకు గురిచేశారు. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్ సోమవారం రాత్రి 10గంటలకు ఇంటి వెనక ఉన్న మామిడిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కొడుకు హర్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

గుంపులలో ఉరివేసుకొని వ్యక్తి..



ఉరగొండ లక్ష్మణ్(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): గుంపుల గ్రామానికి చెందిన ఉరగొండ లక్ష్మణ్(40) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇంట్లోని ఓ గదిలో పడుకున్న లక్ష్మణ్‌ను భోజనం చేయాలని కోరుతూ తల్లి మధునమ్మ మంగళవారం ఉదయం పిలిచింది. అతడు ఎంతకూ గదిలోంచి బయటకు రాకపోయే సరికి కిటికీలోంచి చూసింది. దీంతో ఉరివేసుకొని మృతిచెంది కనిపించాడు. ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉన్న లక్ష్మణ్ రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. అనారోగ్యానికి గురయ్యాడు. భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. కొంతకాలంగా ఒంటరి జీవితం గడుపుతున్న లక్ష్మణ్.. మద్యానికి బానిసై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో దూకి యువకుడు..



శివకుమార్ (ఫైల్)

జమ్మికుంట: తరచూ తాగి వస్తున్న కొడుకును తల్లి మందలించడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన హమాలీ శివకుమార్(25) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగివస్తుండడంతో తల్లి మందలించింది. కోపంతో సోమవారం ఉదయం ఇంటినుంచి వెళ్లి కొత్తపల్లి సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లి లత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పరిధిలోని ఒడ్డెపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతన్‌పల్లికి చెందిన జడ బక్కవ్వ(80) మృతి చెందింది. కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో బిల్లా కోటేశ్వర్ వివరాల ప్రకారం.. బక్కవ్వ మనుమరాలు జడ మౌనిక అనారోగ్యంతో బాధపడుతోంది. కొత్తపల్లి మండలం బావుపేటలో తాయత్తు కట్టించుకునేందుకు ఆటోలో వెళ్తుండగా ఒడ్డెపల్లి వద్ద ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. బక్కవ్వ, మౌనిక, ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా బక్కవ్వ మృతి చెందింది. తల్లి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని జడ రాయమల్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఎస్జీఎఫ్ క్రీడలకు వేళాయె..

- షెడ్యూల్ ఖరారు చేసే పనిలో కార్యదర్శులు
- చివరి వారంలో ప్రారంభం కానున్న మండలస్థాయి పోటీలు
- సన్నద్ధమవుతున్న విద్యార్థులు



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు(ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాల్లో క్రీడల సందడి నెలకొననుంది. 2025–26 విద్యాసంవత్సరం ఆరంభమైంది. ఈ విద్యాసంవత్సరంలో జరగనున్న పాఠశాలలు, కళాశాలల క్రీడా సమాఖ్యల క్రీడాపోటీలు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీంతో రానున్న 2 నెలలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలతో ఆయా మైదానాలు కిక్కిరిసిపోనున్నాయి. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతీ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలస్థాయిలో అండర్–14, 17, కళాశాల స్థాయిలో అండర్–19 విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా మండలస్థాయి నుంచి మొదలుకొని జిల్లా, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు చివరి వారం నుంచి క్రీడాసందడి మొదలు కానుంది.

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్..

పాఠశాలస్థాయిలో అండర్–14, 17 విభాగాలకు మండల, జిల్లా, జోనల్(ఉమ్మడి జిల్లా) స్థాయిల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో చివరి వారం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్, ఎంపిక నిర్వహిస్తారు. సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి, మూడో వారంలో ఉమ్మడి జిల్లా(జోనల్) స్థాయిలో టోర్నమెంట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన జట్లు అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో పాల్గొననున్నాయి.

డీఈవోలతో సమావేశం

2025–26 సంవత్సరానికి 69వ ఎస్జీఎఫ్ క్రీడలకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో ఎస్జీఎఫ్ బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించారు. పోటీల నిర్వహణ, భోజన సౌకర్యం, ఎస్జీఎఫ్ కార్యదర్శుల నియామకం తదితర వాటిపై చర్చించారు. మండల , జిల్లా, ఉమ్మడి జిల్లా పోటీలను ఏవిధంగా నిర్వహించాలి.. పోటీలను ఏఏ తేదీల్లో నిర్వహించాలి.. వర్షం కురుస్తున్న సందర్భంగా పోటీల నిర్వహణ ఏవిధంగా చేయాలని తదితర వాటిపై చర్చించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్జీఎఫ్ పోటీలకు సంబంధించిన తేదీలు ఖరారు కానున్నట్లు పలువురు పీఈటీలు తెలిపారు.

సన్నద్ధమవుతున్న విద్యార్థులు

ఎస్జీఎఫ్ క్రీడల్లో సత్తా చాటేందుకు ఆయా జిల్లాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించి పతకాలు సాధించి జిల్లా, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చేందుకు సాధన చేస్తున్నామంటున్నారు. గత సంవత్సరం కంటే మెరుగైన ఆటతీరును కనబరిచేలా కసరత్తు చేస్తున్నామని, రాష్ట్ర పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు గెలుపే ధ్యేయంగా సాధన చేస్తున్నామని, పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటామని పలువురు చిన్నారులు చెబుతున్నారు.

ప్రతిభ చాటాలి



పాఠశాలస్థాయిలో విద్యార్థులకు క్రీడావేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు ఎంతగానో దోహదపడుతున్నాయి. రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలి. ప్రతీ ఏడాది ఉమ్మడి జిల్లా విద్యార్థులు జాతీయస్థాయి ఎస్జీఎఫ్ టోర్నీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారు. ఈ సంవత్సరం మరింత మెరుగ్గా రాణించి పతకాలు తీసుకురావాలి.

– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి

ఘనంగా నిర్వహిస్తాం



జిల్లాలో అండర్–19 విభాగంలో కళాశాలల క్రీడలను ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాం. పలు క్రీడల్లో కూడా రాష్ట్ర పోటీలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నాం. గత సంవత్సరం ఆర్చరీతోపాటు పలు క్రీడల్లో రాష్ట్ర పోటీలను ఘనంగా నిర్వహించాం. ఈ సంవత్సరం కూడా అందరి సహకారంతో పోటీలను విజయవంతం చేస్తాం.

– మధు జాన్సన్, కళాశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి, కరీంనగర్

ఏర్పాట్లు చేస్తున్నాం



మండలస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పోటీలను అందరి సహకారంతో పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఎస్జీఎఫ్ కార్యదర్శులు, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పోటీలను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– వేల్పుల సురేందర్, పెటా అధ్యక్షుడు, పెద్దపల్లి

సహకారమందిస్తాం



జిల్లాలో ఎస్జీఎఫ్ క్రీడలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పోటీలను ఘనంగా నిర్వహించాలి. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి. ఎస్జీఎఫ్ క్రీడాపోటీలకు జిల్లా క్రీడాశాఖ సహాయ సహకారాలు కూడా అందిస్తాం. చిన్నారులు ఎస్జీఎఫ్ క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలి.

– వి.శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

జాతీయస్థాయిలో ఆడాలని ఉంది



బేస్‌బాల్ క్రీడలో గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో ఆడాను. ఈ సంవత్సరం జాతీయస్థాయిలో ఆడాలని ఉంది. రోజు ప్రాక్టీస్ చేస్తున్నా. జూడోలో కూడా సాధన చేస్తున్నా. ఇంకా పోటీల తేదీలు ఖరారు కాలేదు. ఈసారి ఎలాగైనా జాతీయస్థాయికి ఆడుతా.

– కృషాంక్

అమ్మవారికి చేనేత కళాకారుడి ప్రత్యేక చీర



అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీరను ఈవోకు ఇస్తున్న విజయ్

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సిరిసిల్ల సాయినగర్‌కు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు చీరను నేసి మంగళవారం ఈవో రాధాబాయికి సమర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌ని ఈవో సత్కరించారు. అలాగే దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ జన్మదినం సందర్భంగా ఆలయంలో ఈవో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు హుండీ లెక్కింపు

వేములవాడ రాజన్న హుండీలలోని కట్నాలు, కానుకలను బుధవారం ఉదయం 8 గంటల నుంచి స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో పేర్కొన్నారు. ఆలయ ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి (50) వర్షంలో తడుస్తూ వణుకుతుండగా, వన్‌టౌన్ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 10.30 గంటలకు మృతి చెందాడు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ రామచంద్రరావు తెలిపారు.

రాజన్న సేవలో మాజీ సీఎం కేసీఆర్ సతీమణి



కేసీఆర్ సతీమణి శోభ, మనువడు హిమాన్షుకు రాజన్న చిత్రపటం అందజేస్తున్న లక్ష్మీనరసింహారావు

వేములవాడ: రాజన్నను మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ, మవ్వడు హిమాన్షు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదం అందజేశారు.

వలకు చిక్కి కొండచిలువ మృతి



మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట పెద్దచెరువులో అలుగుకు కట్టిన వలలో పెద్ద కొండచిలువ చిక్కుకుని మృతి చెందింది. దీంతో మత్స్యకారులు వలలోంచి 15 అడుగుల కొండ చిలువను బయటకి తీశారు. భారీ వర్షాలకు చెరువులోకి వరదచేరినపుడు కొండచిలువలు వస్తుంటాయని మత్స్యకారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

గల్లంతైన ఇద్దరు మహిళలు శవాలుగా..

- మరో మహిళ కోసం గాలింపు



అఫ్రిన (ఫైల్)




హసీన (ఫైల్)

జగిత్యాలక్రైం: మహారాష్ట్రలో జరిగిన ఓ వివాహ వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో కారులో ప్రయాణిస్తున్న జగిత్యాల శివారు టీఆర్‌నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఆదివారం గల్లంతయిన విషయం తెల్సిందే. మంగళవారం ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యమయ్యాయి. షేక్ అఫ్రిన (30), సమీన (50), హసీన (28)తోపాటు వారి బంధువు, ఆర్మూర్‌కు చెందిన సోహెబ్ కలిసి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముక్తేడ్ తాలూకా దెగ్లూర్ వెళ్లి తిరిగి వస్తుండగా రవిగాం వద్ద వరదలో గల్లంతయ్యారు. భారీ వరదల్లో కారు కొట్టుకుపోయింది. అక్కడి గ్రామస్తులతో పాటు, రెస్క్యూ టీం, పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టగా హసీన, అఫ్రిన్ మృతదేహాలు దొరికాయి. సమీన మృతదేహం కోసం గాలిస్తున్నారు. మృతదేహాలను అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తీసుకురానున్నారు.

ఎంసీ శేఖర్‌కు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ అవార్డులు



అవార్డులకు ఎంపికైన గిరిజనుల జీవన శైలి ఫొటో



బంగారు పతకం సాధించిన గోల్కొండ కోట ఫొటో



చంద్రశేఖర్

సిరిసిల్ల: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 2025 సంవత్సరానికి రెండు అంతర్జాతీయ అవార్డులను రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్ (మేర్గు చంద్రశేఖర్) సాధించాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ డీ లా ఆర్ట్ అఫ్ ఫొటోగ్రఫీ (ఎఫ్ఐఏపీ) ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ(ఎఫ్ఐపీ)సంస్థలతో కలిపి ఇండోర్ కు చెందిన 'మాల్వా ఫొటోగ్రఫీ' సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫొటోగ్రఫీ పోటీల్లో ఎంసీ శేఖర్ హైదరాబాద్ గోల్కొండ కోటలో తీసిన 'ఫోర్ట్ గేట్' ఫొటోకు బంగారు పతకం వరించింది. ఇదే పోటీలో తెలంగాణకు చెందిన మథుర లంబాడాల జీవనశైలిపై తీసిన 'చిట్ చాట్' చిత్రానికి ఫ్రాన్స్‌కు చెందిన 'ఫియాప్' (ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ లా ఆర్ట్ ఫొటోగ్రఫీ, ఫ్రాన్స్) సంస్థ 'హనరెబుల్ మెన్షన్' అవార్డు ప్రకటించింది. ఇప్పటికే అనేక అంతర్జాతీయ అవార్డులు, పలు దేశాల గౌరవ పురస్కారాలు పొందిన శేఖర్ మూడున్నర దశాబ్దాలుగా సిగ్మా ఫొటో గ్రఫీ సంస్థ ద్వారా రాణిస్తున్నారు. తాజా మరో రెండు అవార్డులు సాధించిన చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు.

పుట్టినరోజునే నూరేళ్లు

- సిరిసిల్ల యువకుడి విషాదాంతం
- వినాయక విగ్రహం తెస్తూ విద్యుదాఘాతంతో మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

సిరిసిల్లటౌన్: పుట్టినరోజున ఇంట్లో అమ్మ ఆశీస్సులు పొంది, దోస్తులతో ఆనందంగా గడుపొచ్చన్న యువకుడిని విద్యుత్ తీగల రూపంలో మృత్యువు కబళించింది. స్థానికులు తెలిపిన వివరాలు..తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌కు చెందిన కొమ్ము మైసయ్య–నవీన దంపతులు సిరిసిల్ల నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్నారు. మైసయ్య ఉపాధి కోసం గల్ఫ్‌లో ఉండగా..భార్య నవీన ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి లక్ష్మీనారాయణ ఉరఫ్ లక్కీ (20), నిఖిల్, శ్వేత సంతానం. కొద్దిరోజులు హైదరాబాద్‌లో పనిచేసిన లక్ష్మీనారాయణ ఇటీవలే సిరిసిల్లకు వచ్చి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు గణేశ్ ప్రతిమను తీసుకురావడానికి లక్ష్మీనారాయణ సోమవారం ఫ్రెండ్స్‌తో ఆర్మూర్ వెళ్లాడు.

పుట్టినరోజే కానరాని లోకాలకు..

మంగళవారం తన పుట్టినరోజు కావడంతో దోస్తులతో కలిసి అప్పటికే ఆర్డర్ ఇచ్చిన 15 అడుగుల వినాయక ప్రతిమను తీసుకొచ్చి వేడుకలు జరుపుకోవాలని లక్కీ, ఫ్రెండ్స్ నిశ్చయించుకున్నారు. సోమవారం రాత్రి వర్షంలో ఇబ్బందులు ఎందుకని ఫ్రెండ్స్ అందరూ ఆర్మూర్‌లోనే పడుకున్నారు. మంగళవారం ఉదయం సిరిసిల్లకు వినాయక విగ్రహంతో ప్రయాణమయ్యారు. కామారెడ్డి జిల్లా ఆరెపల్లి గ్రామ స్టేజీ వద్ద హైటెన్షన్ కరెంటు తీగలకు గణపతి విగ్రహానికి అమర్చిన ఇనుప పైపులు తగిలి లక్ష్మీనారాయణ, సాయి అనే ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే షాక్‌తో పడిపోయారు. స్నేహితులు, స్థానికులు వెంటనే వారికి సీపీఆర్ చేయగా, సాయి మెలకువలోకి రాగా, లక్ష్మీనారాయణ అలానే పడిపోయాడు. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మరో గంట సమయం గడిస్తే సిరిసిల్లకు చేరేవారు. కాగా, లక్కీ, సాయిలకు కాళ్లకు చెప్పులు లేకపోవడంతో షాకు తగిలినట్లు ఫ్రెండ్స్ చర్చించుకుంటున్నారు. పుట్టినరోజునే లక్కీ జీవితం విషాదాంతంగా ముగియడం సిరిసిల్లలో తీరని విషాదం నింపింది.



రోదిస్తున్న లక్కీ కుటుంబ సభ్యులు

టెక్స్‌టైల్ పార్కు కార్మికుల మెరుపు సమ్మె



టెక్స్‌టైల్ పార్కులో ర్యాలీ తీస్తున్న పవర్లూమ్ కార్మికులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పవర్లూమ్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్కులో వస్త్రోత్పత్తి నిలిచిపోయింది. తమ కూలి రేట్లను పెంచాలని కోరుతూ కార్మికులు మంగళవారం మెరుపు సమ్మెకు దిగినట్లు సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు రోజూ రూ.1,000 వేతనం చెల్లించేలా కూలి రేట్లను సవరించాలన్నారు. అలాగే ఒప్పంద గడువు ముగిసిన ప్రైవేటు వస్త్రానికి 10 పిక్కులకు రూ.50 పైసలు పెంచాలన్నారు. యజమానులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్కు పవర్లూమ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు వస్త్రాలకు సంబంధించి యజమానులు కూలి పెంచే వరకు కార్మికులు ఎవరూ పనులకు వెళ్లకూడదని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం గేటు వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మిక నాయకులు సదానందం, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.